## ఆదా అయ్యే నీటిని బేసిన్ ప్రాజెక్టులకివ్వాలి

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదనలు

హైదరాబాద్, మే15 (నమస్తే తెలంగాణ): కృష్ణా డెల్టా వ్యవస్థ (కేడీఎస్) ఎడమ కాల్వ కింద ఉన్న కొంత భూమి ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (సీఆర్‌డీఏ) పరిధిలోకి వెళుతుందని, కాబట్టి ఆ మేరకు ఏపీకి సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా అందిస్తున్న నీటి అవసరాలు తగ్గుతాయని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. తద్వారా ఆదా అయ్యే నీటిని బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్ 3 మార్గదర్శకాల మేరకు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ ఢిల్లీలో గురువారం పునః ప్రారంభమైంది. ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర ఎదుట తెలంగాణ సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలను వినిపించారు. సీఆర్‌డీఏ పరిధిలోకి వెళ్లే ప్రాంతాలకు సాగునీటి అవసరం ఉండబోదని తెలిపారు. ఆ నీటిని బేసిన్ ప్రాజెక్టులకు కేటాయించాలని వాదించారు. ఎన్‌సీపీ కుడి కాల్వ కింద ఆయకట్టులో కొంత భాగానికి పులిచింతల ప్రాజెక్ట్ నుంచి నీటిని ఎత్తివేయడం వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సాగునీటిని అందించవచ్చని తెలిపారు. పెన్నా, ఇతర బేసిన్లలో ఏపీకి 360 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యముందని, ఆ నిల్వకు 1.4 రెట్లు నీటిని ఉపయోగించుకునే అవకాశముందని వాదించారు. తాజాగా బొల్లేపల్లి జలాశయాన్ని 150 టీఎంసీలతో నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుందని గుర్తుచేశారు.

**ఆరుతడి పంటలు సాగుచేయాలి**

ప్రాజెక్టుల్లో పంట నీటి అవసరాన్ని అంచనా వేసేందుకు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని కోరుతూ, దీనిపై తెలంగాణ తరఫున డాక్టర్ పళనిసామి సమర్పించిన వ్యవసాయ అఫిడవిట్‌ను ట్రిబ్యునల్ దృష్టికి వైద్యనాథన్ తీసుకెళ్లారు. బేసిన్ వెలుపలి ప్రాంతాల్లో తడి పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగుచేసేలా చూడాలని, అలా వివిధ మార్గాల ద్వారా ఆదా చేసిన నీటిని బేసిన్‌లోని కరువు ప్రాంతాలకు కేటాయించవచ్చని వివరించారు. ఇది ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.

# 2న 'జాగృతి' యువకవుల సమ్మేళనం

- తెలంగాణ జీవన విశిష్టతను ప్రపంచానికి చాటి చెబుదాం
- యువతలో సాహిత్యాభిలాష పెంపునకు సమ్మేళనం దోహదం
- 26లోగా యువ కవుల వివరాలు నమోదు చేసుకోవాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరగనున్న సమ్మేళన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత.. చిత్రంలో కాంచనపల్లి, సుబ్బయ్య తదితరులు

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రావిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువకవుల సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ సారస్వత పరిషత్తులో జరుగనున్న ఈ సమ్మేళనం పోస్టర్‌ను గురువారం తన నివాసంలో కవిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ జీవన శైలి విశిష్టతను చాటి చెప్పడంతోపాటు యువతలో సాహితీ స్పృహను, చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. తెలంగాణ తాత్వికతను, చారిత్రక నేపథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సహనశీలతను, సమగ్రతను, సమాజంలో ఉండే సమిష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువకవులు తమ కలాలకు పదును పెట్టాలని కవిత పిలుపునిచ్చారు. కవులు ఈ సమ్మేళనంలో తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ చరిత్రను, పోరాటస్ఫూర్తిని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నేలపై అనేక గొప్ప కవులు, కవయిత్రులు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని కలిగించాలని, ఆ పరంపరను కొనసాగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు.

**సురవరం ప్రతాప్‌రెడ్డి స్ఫూర్తితో ముందడుగు**

గోల్కొండ కవుల సంచిక ద్వారా సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణ రచయితలు, కవులు, కవయిత్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, ఆ స్ఫూర్తితో తాము ముందుకు సాగుతున్నట్టు కవిత వివరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాహిత్యానికి కనీస గౌరవమే ఇవ్వడం లేదని విమర్శించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. దున్నపోతుపై వాన పడినట్టుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. జానపదానికి గౌరవం దక్కడం కోసం జీవితాంతం కృషి చేసిన బిరుదురాజు శత జయంతికి రాష్ట్ర ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వలేదని, అలాగే గొప్ప కవులు, కళాకారులు సమాజానికి చేసిన సేవలను ప్రభుత్వం విస్మరించడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో కవులు కాంచనపల్లి, వనపట్ల సుబ్బయ్య, ఘనపురం దేవేందర్, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్‌రావు, మనోజ్‌గౌడ్, లలిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**యువ కవులకు ఆహ్వానం**

యువకవుల సమ్మేళనంలో పాల్గొనాలనుకున్న కవులు, కవయిత్రులు 35 ఏండ్లలోపు వారై ఉండాలని కవిత తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో కవితలు వినిపించవచ్చునని తెలిపారు. ఈ మేరకు తమ వివరాలు నమోదు చేయించుకోవడానికి ఈ నెల26 లోపు kavitha. telangana @gmail. comకు మెయిల్ చేయాలని కవిత సూచించారు.

# Rట్యాక్స్ పిడుగు

మొదటిపేజీ తరువాయి...





ఆయన బంధువర్గం అమలు చేస్తున్న అనధికారిక సుంకమని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్తున్నారు. రియల్ వ్యాపారాన్ని లగ్జరీ విల్లాలు, విల్లాలు, సాధారణ అపార్ట్‌మెంట్లు, గృహాలు ఇలా క్యాటగిరీలుగా విభజించి క్యాటగిరీకో రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్టు సమాచారం. లగ్జరీ విల్లాలైతే స్క్వేర్ ఫీట్‌కు రూ.200, విల్లాలకు రూ.150, సాధారణ అపార్టుమెంట్లు, గృహాలకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్టు రియల్టర్లు ఇటీవల రాహుల్ గాంధీకి చేసిన ఫిర్యాదులో వివరించినట్టు తెలిసింది. ఎలాంటి ఆటంకం లేకుండా ఇండ్లు కట్టి అమ్ముకోవాలంటే కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ముఖ్యనేతకు కప్పం కట్టాల్సిందేనని వారు రాహుల్‌కు చెప్పినట్టు సమాచారం.

**ట్యాక్స్ కట్టకుంటే హైడ్రా అటాక్**

హైదరాబాద్ నగరంలో హైడ్రా వచ్చిన కొంత కాలానికే అధికారుల అండదండలతో అనధికార ఆర్-ట్యాక్స్ అమల్లోకి వచ్చిందని, ఏడాది నుంచి ముక్కు పిండి తమ వద్ద నుంచి వసూలు చేస్తున్నారని రియల్టర్లు గొల్లుమంటున్నారు. సుంకం చెల్లించకుంటే హైడ్రా వస్తుందని బెదిరిస్తున్నట్టు వాపోతున్నారు. ముందుగా హైడ్రా అధికారులు వచ్చి నోటీసులిస్తారని, నోటీసులకు లొంగక పోతే హైడ్రా బుల్డోజర్లు దిగుతాయని, అధికారులు వస్తారని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ రియల్టర్ తెలిపారు. భవన నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అనుమతించిన ఎస్‌ఎఫ్‌టీల మేరకు టాక్స్ వసూలు చేస్తున్నారని ఫిర్యాదులున్నాయి. హైదరాబాద్ చుట్టూ ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ నగర పరిసరాల్లోని విలువైన ప్రాంతాల్లో లగ్జరీ ఇండ్ల కొనుగోళ్లపై సంపన్న వర్గాల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని, ఈ ఏడాది మొత్తం 36,974 నివాస గృహాల విక్రయాలు జరిగాయని, ఇందులో 12 శాతం లగ్జరీ విల్లాల వాటా ఉన్నదని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్తున్నారు. ఈ విల్లాలకు ఎస్‌ఎఫ్‌టీకి రూ 200 చొప్పున ఆర్- టాక్స్ వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోటి నుంచి రూ. 2 కోట్ల ధర పలికే ఇండ్లపై స్క్వేర్ ఫీట్‌కు 150 చొప్పున వసూలు చేస్తున్నట్టు చెప్తున్నారు. రూ.50-80 లక్షల లోపు నివాసాల మీద రూ 100 చొప్పున వసూలు చేస్తున్నట్టు వాపోయారు.

**అమ్ముడుపోకున్నా కట్టాల్సిందే!**

నగరంలో మొత్తం విక్రయాల్లో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే రూ.50-80 లక్షల లోపు నివాసాల వాటానే అధికంగా ఉంటుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్త కంపెనీలు రాలేదని, కొత్త ఉద్యోగాలు రాలేదని, వర్క్ ఫ్రమ్ హోమ్‌తో ఆఫీస్ స్పేస్ డిమాండ్ తగ్గిపోయిందని, దీంతో నగరంలో కమర్షియల్ స్పేస్ మిలియన్ల ఎస్‌ఎఫ్‌టీలు ఖాళీ ఉన్నాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెప్తున్నారు. అపార్ట్‌మెంట్ల సేల్స్ బాగా పడిపోయని వాపోతున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 2 లక్షల గృహాలు, అపార్టుమెంట్లు కొనుగోలు లేక ఖాళీగా ఉన్నాయని, నిర్మాణం పూర్తయింది కాబట్టి ట్యాక్స్ కట్టాల్సిందేనని ముక్కుపిండి వసూలు చేస్తున్నట్టు బాధితులు రాహుల్ గాంధీకి వివరించినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.

## ఆర్టీఐ కమిషన్‌లో బీసీలకు మొండిచేయి

**బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర**

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు వెన్నుపోటు పొడిచిందని, ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా కమిషనర్‌గా అవకాశం ఇవ్వకుండా మొండిచేయి చూపిందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కులగణన చేసి, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం వరకు రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చాక అడుగడుగునా బీసీలను దగా చేస్తున్నదని దుయ్యబట్టారు. సమాచార హక్కు చట్టం కమిషన్‌లో ఐదుగురికి అవకాశం కల్పిస్తే.. వారిలో ఒక్క బీసీ కూడా లేకపోవడమే ఇందుకు నిదర్శనమని, ఇది కాంగ్రెస్ ద్రోహమేనని పేర్కొన్నారు. జనాభాలో సగమున్న బీసీలకు ఒక్క కమిషనర్‌గానైనా నియమించకపోవడం బీసీల ఆత్మగౌరవం దెబ్బతీయడమేనని ధ్వజమెత్తారు. బీసీలకు పదవులు దక్కకుండా ఉండేందుకే దాదాపు 27 కార్పొరేషన్లకు పాలకమండళ్లను నియమించడమే లేదని మండిపడ్డారు. ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## సెల్ టవర్ ఎక్కిన యువకుడు

- ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు తొలగించారని ఆవేదన
- ఇల్లు మంజూరు చేయిస్తానని రూరల్ ఎమ్మెల్యే హామీ



నిజామాబాద్ మండలం మల్లారంలో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న జల్లాపురం సాయిలు

సారంగాపూర్, మే 15: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో నుంచి అధికారులు తన పేరును తొలగించారని నిరసన వ్యక్తంచేస్తూ ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కిన ఘటన నిజామాబాద్ మండలం మల్లారంలో గురువారం చోటుచేసుకున్నది. బాధితుడి వివరాల ప్రకారం.. జల్లాపురం సాయిలు తన భార్య, ఇద్దరు పిల్లలతో మల్లారంలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందనే నమ్మకంతో ఉన్న సొంత స్థలంలో బేస్‌మెంట్ వరకు ఇల్లు నిర్మించుకున్నాడు. అతడి పేరును ఇందిరమ్మ కమిటీ బాధ్యులు అర్హుల జాబితాలో చేర్చారు. సర్వే నిర్వహించిన అధికారులు.. సాయిలు బేస్‌మెంట్ వరకు ఇల్లు నిర్మించడంతో అర్హుల జాబితా నుంచి పేరును తొలగించారు. దీంతో యువకుడు గ్రామ సమీపంలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. కాంగ్రెస్ నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి విషయాన్ని ఫోన్‌లో వివరించగా ఎమ్మెల్యే స్పందించి.. బాధితుడితో మాట్లాడారు. ఇల్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇవ్వడంతో సాయిలు టవర్ దిగాడు. రూరల్ పోలీసులు బాధితుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండలో కలెక్టర్ ఎదుట ఇందిరమ్మ ఇంటి కోసం గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

## కలెక్టర్ ఎదుట గూడు గోడు

**ఇల్లు మంజూరు చేయాలని కోరిన మహిళ**

చండ్రుగొండ, మే 15 : నిరుపేదనైన తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ ఓ మహిళ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు గురువారం తన గోడు వెల్లబోసుకున్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం రావికంపాడుకు వెళ్లిన కలెక్టర్‌కు.. గ్రామానికి చెందిన మద్దిరాజు కళమ్మ తాను దరఖాస్తు చేసుకున్నా ఇందిరమ్మ ఇల్లు రాలేదని, వ్యవసాయ భూములు, భవనాలు ఉన్న వారికి ఇండ్లు ఎలా మంజూరు చేశారని పేర్కొంది. సర్దిచెప్పేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేయగా.. కలెక్టర్ సముదాయించి, రెండో జాబితాలో అర్హులైన వారికి ఇండ్లు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## లైబ్రేరియన్లు, ఆర్ట్‌క్రాఫ్ట్ టీచర్లకూ నైట్‌డ్యూటీలు!

- వచ్చే ఏడాది నుంచి అమలు
- బీసీ గురుకుల సొసైటీ ఉత్తర్వులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్, మే15 (నమస్తే తెలంగాణ): ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, లైబ్రేరియన్లకు సైతం నైట్‌డ్యూటీలు విధించాలని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ నిర్ణయించింది. సొసైటీ కార్యదర్శి సైదులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నిర్ణయంపై సొసైటీ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇటీవల ఎస్సెస్సీ, ఇంటర్‌లో చాలా బీసీ గురుకులాల్లో 100% ఉత్తీర్ణత నమోదు కాలేదు. దీనిపై సెక్రటరీ రివ్యూ చేయగా నైట్‌డ్యూటీల వల్లే 100% ఉత్తీర్ణత రాలేదని టీచింగ్ స్టాఫ్ నివేదించినట్టు తెలిసింది. టీచింగ్ స్టాఫ్‌తోపాటు ఆర్ట్‌క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్లకు సైతం నైట్‌డ్యూటీలు విధించాలని నిర్ణయించినట్టు సమాచారం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి వారికి వార్డెన్ డ్యూటీలు వేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంపై ఆర్ట్‌క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్ టీచర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వేతనాలు, నిర్దేశించిన విధులు పూర్తి భిన్నమని, ప్రమోషన్లు కూడా తమకు లేవని గుర్తుచేశారు. ఇదే విషయాన్ని సెక్రటరీకి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచించాలని, సరైన న్యాయం చేయాలని లైబ్రేరియన్లు, ఆర్ట్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్నికల బదిలీలే ఏకైక ఉమ్మడి ఎజెండా

- ఇప్పుడు కాకపోతే.. భవిష్యత్తులో మరెప్పుడూ కావు
- రెవెన్యూ ఉద్యోగ సంఘాల సమావేశంలో లచ్చిరెడ్డి

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): ఎన్నికల బదిలీలే ఏకైక ఎజెండాగా ముందుకెళ్దామని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి ఉద్యోగులకు పిలుపునిచ్చారు. సంప్రదాయబద్ధంగా జరిగే ఎన్నికల బదిలీలను ఇప్పుడు చేసుకోకపోతే.. భవిష్యత్తులో మరెప్పుడూ కావని అన్నారు. ఈ అవకాశాన్ని రెవెన్యూ ఉద్యోగులుగా మనమంతా కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే కలిసికట్టుగా ముందుకెళ్లాలని స్పష్టంచేశారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ప్రత్యేకంగా భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూశాఖలో ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. బదిలీల అంశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీతోపాటు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికల బదిలీలు జరిగి రెండేండ్లు కావస్తోందని, తద్వారా ఆయా ఉద్యోగులు, వారి కుటుంబాలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు ఆయన తెలిపారు.

## హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్లు 27% తగ్గుదల

న్యూఢిల్లీ: వలస నిబంధనలను అమెరికా కఠినతరం చేయడంతో హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోయాయి. యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4,70,342 ఎలిజిబుల్ హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇవి 3,43,981కి తగ్గిపోయాయి. అంటే, 26.9 శాతం తగ్గుదల కనిపించింది. కొత్త హెచ్-1బీ వీసాలను కోరిన వ్యక్తుల సంఖ్య కూడా తగ్గింది. ఈ ఏడాది ఎలిజిబుల్ యూనిక్ బెనిఫిషియరీస్ 3,36,000 మంది కాగా, నిరుడు వీరి సంఖ్య 4,23,000. అనేక యాజమాన్యాలు ఒకే లబ్ధిదారు తరఫున దాఖలు చేసే రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇవి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 47,314 కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7,828కి తగ్గిపోయాయి. హెచ్-1బీ వీసా జారీ ప్రక్రియను కఠినతరం చేసినందు వల్ల మోసపూరిత దరఖాస్తులు తగ్గినట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది. తప్పుడు వివరాలు, సరైనది కాని పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్ ఇన్ఫర్మేషన్ సమర్పిస్తే, రిజిస్ట్రేషన్‌ను చెల్లనిదిగా ప్రకటిస్తామని స్పష్టంచేసింది.

## మణిపూర్‌లో ఎన్‌కౌంటర్

ఇంఫాల్, మే 15: మణిపూర్‌లోని చందల్ జిల్లాలో బుధవారం అస్సాం రైఫిల్స్ చేపట్టిన ఆపరేషన్‌లో కనీసం పది మంది మిలిటెంట్లు మృతిచెందినట్టు తూర్పు కమాండ్ ఆర్మీ అధికారులు ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇండో-మయన్మార్ సరిహద్దు ఖేంగ్‌జోయ్ తహసిల్ పరిధిలోని న్యూ సంతాల్ గ్రామం సమీపంలో మిలిటెంట్ల కదలికలపై నిఘా వర్గాలకు అందిన సమాచారం మేరకు స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలో అస్సాం రైఫిల్స్ ఈ ఆపరేషన్ చేపట్టినట్టు పేర్కొన్నారు.

# సరస్వతి పుష్కరాలు ప్రారంభం

- పుష్కర స్నానాలను ప్రారంభించిన మాధవానంద సరస్వతి స్వామి
- పుణ్య స్నానాలు ఆచరించిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రముఖులు
- తొలిరోజు మందకొడిగా భక్తుల రాక
- సౌకర్యాల్లేక ఇబ్బందులు పడ్డ ప్రజలు



పూజలు చేస్తున్న మాధవానంద సరస్వతిస్వామి, మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

మహదేవపూర్(కాళేశ్వరం), మే 15 : కాళేశ్వర-ముక్తీశ్వర క్షేత్రాన త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం వేద మంత్రోచ్చారణలతో మార్మోగింది. దక్షిణాది రాష్ట్రాల్లో సరస్వతీ నది అంతర్వాహినిగా ప్రవహిస్తున్న ఏకైక త్రివేణి సంగమ క్షేత్రం తీరాన ఉదయం 5.44 గంటలకు పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోదావరి, ప్రాణహిత నదులు కలిసే చోట సరస్వతీ నది అంతర్వాహినిగా ఉండే ఈ ప్రాంతంలో పుష్కరాల నిర్వహణకు ఎంతో విశిష్టత ఉన్నది. అత్యంత అరుదైన సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో పవిత్ర త్రివేణి సంగమంలో గురుమదానానంద సరస్వతి పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వామి పుష్కర స్నానాలను ప్రారంభించారు. వేద పండితులు సరస్వతీ నదికి ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరుడికి తొలి పూజలు చేసిన తర్వాత సరస్వతీ నది పుష్కర మహోత్సవానికి అంకురార్పరణ చేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు పుష్కర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి, శుభానందాదేవి, సరస్వతీ మాత ఆలయాలను ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

**మందకొడిగా భక్తుల రాక**

సరస్వతి పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. నదీ తీరం వద్ద పితృ తర్పణాలు, సంకల్ప పూజలు నిర్వహించారు. రోజుకు దాదాపు రెండు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేయగా, మొదటిరోజు భక్తుల రద్దీ మందకొడిగా ఉన్నది. త్రివేణి సంగమం వద్ద సరైన సౌకర్యాలు లేక భక్తులు అవస్థ పడ్డారు. చలువ పందిళ్లు సరిపడా లేక చిన్నారులు, వృద్ధులు ఎండవేడికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పుష్కరాల్లో పూజలు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 600మంది పూజారులు త్రివేణి సంగమానికి వచ్చారు.

# పుష్కర స్నానంతో తప్పులకు విముక్తి

- కాళేశ్వరాన్ని అభివృద్ధి చేస్తా
- మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి
- రూ. 200 కోట్లు కేటాయిస్తా
- దేశాన్ని పీవీ నర్సింహారావు ఆర్థిక పథంలో నడిపించారు
- అదే స్ఫూర్తిని శ్రీపాదరావు, శ్రీధర్‌బాబు కొనసాగించారు
- పుష్కరాల్లో సీఎం రేవంత్‌రెడ్డి



నదిలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

జయశంకర్ భూపాలపల్లి, మే15 (నమస్తే తెలంగాణ): పుష్కరాల్లో స్నానం చేస్తే మనం చేసిన తప్పులకు విముక్తి లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో గురువారం మొదలైన సరస్వతీ పుష్కరాల్లో ఆయన పాల్గొన్నారు. సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించారు. సరస్వతీ ఘాట్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సరస్వతీ ఘాట్ వద్ద భక్తులనుద్దేశించి మాట్లాడారు. 'ప్రతి ఒక్కరూ తెలియకుండా ఏదో ఒక తప్పు చేస్తూనే ఉంటారు.. మనం చేసిన తప్పులకు ముక్తి లభించాలంటే పుష్కర స్నానాలు ఆచరించాలి.. ఇది మన శాస్త్రం చెబుతున్నది' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తన హయాంలో సరస్వతీ పుష్కరాలు రావడం, ఇక్కడ పుణ్యస్నానం చేయడం తన అదృష్టమన్నారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి శ్రీధర్‌బాబు ఎంతో తపిస్తుంటారని, శ్రీధర్‌బాబు రోజుకు 18 గంటలు పని చేస్తున్నారన్నారు. ఆయన నియోజకవర్గానికి తక్కువ సమయం కేటాయించి, రాష్ట్ర అభివృద్ధికి ఎక్కువ సమయం కేటాయించాలని కోరారు. మంథని నుంచి శాసన సభ్యుడిగా పని చేసిన తెలంగాణ బిడ్డ పీవీ నర్సింహారావు దేశాన్ని ఆర్థిక పథం వైపు నడిపించారని, అనంతరం శ్రీపాదరావు ఈ నియోజకవర్గాన్ని ముందుకు నడిపించడంతో పాటు శాసన సభను హుందాగా నడిపించారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో మూడోతరం శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్నారని చెప్పారు. కాళేశ్వరం అభివృద్ధికి రూ.100 కోట్లు కావాలని అడిగారని, రూ. 100 కోట్లు కాదు.. రూ. 200 కోట్లు ఇస్తానని ప్రకటించారు.

**ఆలయానికి నిధులివ్వండి : శ్రీధర్‌బాబు**

కాళేశ్వరం ఆలయాన్ని పర్యాటకంగా మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లు కేటాయించాలని సీఎంను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. 12 రోజుల పాటు జరిగే సరస్వతీ పుష్కరాల పనుల కోసం 17 శాఖల అధికారులు శ్రమించారని, సీఎం సూచన మేరకు కాశీ నుంచి పండితులను పిలిపించామని చెప్పారు. మాధవానంద సరస్వతి సూచన మేరకు ఆలయ పవిత్రతను కాపాడాలని కోరారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, లక్ష్మణ్, ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

**కాశీ పండితులతో నదీ హారతి**

గురువారం రాత్రి సరస్వతీ పుష్కర ఘాట్ సమీపంలో కాశీ నుంచి వచ్చిన ఏడుగురు వేద పండితులు అశితోష్ పాండే, అభిషేక్ పాండే, నితీశ్‌కుమార్ పాండే, సమంత్ తిహారీ, కౌశల్ తివారీ, దీపక్ పాండే, అంకిత్ పాండే, శివం మిశ్రా 45 నిమిషాల పాటు సరస్వతీ నవరత్న హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా పేల్చిన పటాకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హారతి కార్యక్రమంలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం అదే వేదికపై సీఎం మాట్లాడారు.

**సీఎం ఎదుట సొంత పార్టీ నేతల ఆందోళన**

పుష్కర ఘాట్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి సొంత పార్టీ నేతల నుంచే నిరసన సెగ తగిలింది. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చెన్నూరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఫ్లెక్సీల్లో పెద్దపెల్లి ఎంపీ ఫొటో ఎందుకు పెట్టలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ అధికారులకు దళిత ఎంపీ కనిపించడం లేదా అని ప్లకార్డులతో ఆందోళన చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకొని, ఈడ్చుకుంటూ ఠాణాకు తీసుకెళ్లారు.

## పీఆర్‌లో 22మందికి పదోన్నతి

- జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి
- జెడ్పీ సూపరింటెండెంట్ల ప్రమోషన్లకు ప్రతిపాదన

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖలో పలువురికి ప్రమోషన్లు కల్పించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లా పంచాయతీ ఆఫీసు (పీడీవో)ల్లో పనిచేస్తున్న 22మంది జూనియర్ అసిస్టెంట్లు/టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు పంచాయతీరాజ్, రూరల్ ఎంప్లాయిమెంట్‌శాఖ డైరెక్టర్ సృజన ప్రొసీడింగ్స్ జారీచేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాల నుంచి సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్న డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాలకు 22మందిని పదోన్నతితో బదిలీ చేశారు. అలాగే, రాష్ట్రంలోని వివిధ జిల్లా పరిషత్ (జెడ్పీ) కార్యాలయాల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్లకు కూడా ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జెడ్పీల్లో 30 నుంచి 40మంది సూపరింటెండెంట్లు ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, అర్హత ప్రకారం వారికి కూడా ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉన్నదని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. పీఆర్ అధికారులు పంపించిన ఈ ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు అధికారవర్గాలు వెల్లడించాయి.

## ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల్లో సడలింపు

గిఫ్ట్, ఎక్స్ఛేంజ్, వారసత్వ లావాదేవీలకు అనుమతి

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) నిబంధనలను సవరిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ (ఎంఏయూడీ) జీవో 98 జారీ చేసింది. ఇప్పటివరకు కేవలం సేల్‌డీడ్ ద్వారా జరిగే లావాదేవీలను మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్‌లో పరిగణనలోకి తీసుకునేవారు. ఇకపై గిఫ్ట్, ఎక్స్ఛేంజ్, వారసత్వ డీడ్‌ల ద్వారా జరిగే లావాదేవీలను కూడా పరిశీలనలోకి తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తుల్లో ఈ తరహా అప్లికేషన్ల సంఖ్య 4 వేలకు మించి ఉండదని ఒక సీనియర్ అధికారి తెలిపారు.